
క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

చిరుధాన్యాలు సాగు చేసుకోవాలి

నందికొట్కూరు రూరల్ : కేసీ కాలువ కింద రైతులు వరికి బదులుగా చిరుధాన్యాలు, మినుము, శనగ, అపరాల పంటలను సాగు చేసుకోవాలని ఏఓ షేక్షావలి సూచించారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో పంటనమోదుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటనమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు, రైతులు పాల్గొన్నారు.

29న మహాధర్నా

వెలుగోడు: ఈ నెల 29న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ముఖ్య నేతల సమావేశం జరిగింది. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. రామదాసు, సీఐటీయూ మండల అధ్యక్షుడు వి.నాగమోహన్ మాట్లాడుతూ .. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ దళితుల హత్యలు, అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలోనాయకులు వి.కిషోర్, పి.కృష్ణ , యల్. గౌరీ, టీ. జాషువా, ఎల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారి నిర్మాణ పనులు



జేసీబీతో మట్టి తొలగిస్తున్న దృశ్యం

పాములపాడు: మండల కేంద్రంలోని రామాలయం వీధిలో గురువారం అంతర్గత రహదారి నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రోడ్డుపై పేరుకుపోయిన మట్టి తొలగింపు పనులు చేపట్టారు. ఇళ్ల ముందు వేసుకున్న బండలను తొలగించి మార్కింగ్ ఇచ్చారు. త్వరిత గతిన పనులు పూర్తి చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు.

సర్వే పకడ్బందీగా చేపట్టండి

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్ష సథకం సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎం, ఆశవర్కర్లు, వలంటీర్లు అందరి సమన్వయంతో సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి వినయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే ఆహ్లాద వాతావరణం



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

కొత్తపల్లి: మొక్కలు పెంచడం ద్వారా ఎక్కడైనా అహ్లాదకరమైన వాతావరణం సృష్టించవచ్చని ఎంపీడీఓ మేరి తెలిపారు. గురువారం మండలంలోని శివపురం గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇన్సిస్ట్యూషన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల అవరణలో మొక్కలు నాటడం ద్వారా అహ్లాదకరమైన వాతావరణం సృష్టించవచ్చన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఐటీడీఏ ఏపీఓ రాజు నాయక్, హాస్టల్ వార్డెన్ వెంకటస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ఓంకారం హుండీ కానుకల లెక్కింపు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం పుణ్యక్షేత్రంలో ఈ నెల 23న హుండీ కానుకల లెక్కింపును నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీ గంగా, ఉమాసమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఉంటుందని చెప్పారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది హాజరు కావాలని ఈఓ నాగప్రసాద్ కోరారు.

సస్యరక్షణతో లాభాల పంట

- శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో 8,590 ఎకరాల్లో సాగు
- ఎత్తయిన మడుల్లో మిరపనార పెంచాలి
- తెగుళ్ల నివారణకు సకాలంలో చర్యలు తీసుకోకపోతే తీవ్ర నష్టం



సాగుచేసిన మిరప పంట

జూపాడుబంగ్లా: వాణిజ్య పంటల్లో ప్రధానమైన పంట మిరప. ఈ పంటలో వ్యాపిస్తున్న తెగుళ్ల నివారణకు సకాలంలో చర్యలు తీసుకోకపోతే దిగుబడి తగ్గడంతో పాటు పంటనష్టం వాటిల్లుతుందని హార్టికల్చర్ అధికారిణి చందన తెలిపారు. తెగుళ్లను గమనించి సకాలంలో నివారణ చర్యలు చేపడితే సత్వరమే వాటిని నివారించుకోగలిగితే ఆరు మాసాల్లో అధిక దిగుబడులతో పాటు లాభాలు ఆర్జించవచ్చన్నారు.

8,590 ఎకరాల్లో సాగు..

శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో 2,610 ఎకరాలు, నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, పాములపాడు, మిడుతూరు, నందికొట్కూరు మండలాల పరిధిలో 5,980 ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. మిరప పంట ఆరు మాసాల పంట కనుక ఖరీఫ్ సీజన్‌కు గాను ఆగస్టు మాసంలో, రబీ సీజన్‌కు గాను నవంబర్, డిశంబర్ మాసాల్లో నాటుకోవటం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

తెగుళ్లు.. నివారణ చర్యలు..

నారుకుళ్లు తెగులు ..

లేతమొక్కల కాండం మెత్తబడి నారు గుంపులు గుంపులుగా చనిపోతుంది. దీని నివారణకుగాను ఎత్తయిన నారుమడుల్లో మిరపనారను పెంచాలి. మాంగోజబ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసి విత్తనాలు విత్తుకోవాలి. నారు మొలకెత్తిన వెంటనే, వారం రోజుల తర్వాత లీటరు నీటికి 1.5గ్రాముల చొప్పున మెటలాక్సీల్ కలిపి డ్రంచింగ్ చేయాలి. నారుకుళ్లు తెగులు కనిపిస్తే వెంటనే నీటిని కట్టం ఆపివేయాలి.

ఆకుమచ్చ తెగులు

వాతావరణం మబ్బుగా ఉండి, ముసురు వర్షాలు కురుస్తున్న సమయంలో మిరపలో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు వ్యాపిస్తుంది. ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పండువారి రాలిపోతుంటాయి. ఈ తెగులు నివారణకు గాను 10లీటర్ల నీటిలో 30 గ్రాముల ఆక్సీక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందును కలిపి పంటపై పిచికారీ చేయాలి.

బూడిదరంగు ఆకుమచ్చ తెగులు

పంటలో ఈ తెగులు వ్యాపించినప్పుడు మిరప చెట్ల ఆకులపై బూడిదరంగు మచ్చలు ఏర్పడి ఆకులు పండువారి రాలిపోతుంటాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 2.5గ్రాముల మ్యాంగోజబ్, 2 గ్రాముల కార్బండిజిమ్ మందును కలిపి మిరపచెట్లపై పిచికారీ చేయాలి.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

మిరప పంటకు చీడ, పీడల బెడద అధికంగా ఉంటుంది. పంట నాటినప్పటి నుంచి రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ తెగుళ్లు, పురుగులను నివారించుకోగలిగితే దిగుబడి అధికంగా సాధించవచ్చు. తద్వారా లాభాలు ఆర్జించవచ్చు. సకాలంలో తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే పంట నష్టం వాటిల్లే అవకాశం ఉంది. పంటలో వ్యాపించిన తెగుళ్లు నివారణకాకపోతే వెంటనే హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులకు సమాచారం ఇస్తే పంటను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇస్తాం. – చందన, హార్టికల్చర్ అధికారిణి

కొమ్మకుళ్లు తెగులు

ఈ రకం తెగులు పంటలో వ్యాపించినప్పుడు చెట్ల లేతకొమ్మల కణుపుల వద్ద కుళ్లు ఏర్పడి చిగుళ్లు మాడిపోయి కొమ్మలు విరిగిపోతుంటాయి. ఈ తెగులు నివారణకు 10లీటర్ల నీటిలో 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందును కలిపి వారంలో రెండు పర్యాయాలు పంటపై పిచికారీ చేయాలి.

కొమ్మ ఎండు, కాయకుళ్లు తెగులు

ఈ తెగులు వ్యాపించినప్పుడు మిరప చెట్ల ముదురు కొమ్మల బెరడుపై గోధుమరంగు మచ్చలు ఏర్పడి కొమ్మలు పైనుంచి కిందికి ఎండుతాయి. పండుకాయల మీద నల్లటి మచ్చలు ఏర్పడి కాయలు కుళ్లిపోతుంటాయి. ఈ తెగులు నివారణకు గాను ఎకరాకు 200మిల్లీ లీటర్ల ప్రొఫికొనజోల్ లేదా 100మిల్లీ లీటర్ల డైఫెనకొనజోల్ లేదా 200మి.లీటర్ల అజాక్సీస్ట్రోబిన్ లేదా 500గ్రాముల కాపర్‌హైడ్రాక్సైడ్ తదితర రకాల మందులను పిచికారీ చేస్తే మేలు.



మిరప పంటను పరిశీలించి రైతులకు సలహాలు ఇస్తున్న హార్టికల్చర్ అధికారిణి చందన

మొక్క ఎండు తెగులు

మొక్కలు వడలిపోయి, ఎండిపోయి పూత, పిందెతోపాటు ఆకులు రాలిపోతాయి. ఈ తెగులు నివారణకు గాను కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటరు నీటిలో 3గ్రాముల చొప్పున కలిపి మొక్కల కాండం వద్ద పోయాలి. అలాగే 10 లీటర్ల నీటిలో అజోక్సీస్ట్రోబిన్ మందును పంటపై పిచికారీ చేసుకోవాలి.

పైముడత, కింది ముడత తెగులు

మిరపలో తెగుళ్లలో పై ముడత, కిందిముడత తెగులు అధికంగా వ్యాపిస్తాయి. మిరపచెట్ల ఆకుల కిందిభాగంలో తెల్లని థ్రిప్స్ వ్యాపించి రసం పీల్చడం వల్ల ఆకుల పైభాగం ముడుచుకొనిపోతాయి. దీన్ని పైబింగి తెగులు అంటారు. ఆకులపై భాగంలో నల్లిలాంటి పురుగులు వ్యాపించి రసం పీల్చటం వల్ల ఆకుల కిందిభాగం ముడుచుకొనిపోతాయి. దీన్ని కిందిబింగి అంటారు. వీటి నివారణకు జోలోన్, ఫిప్రోనిల్, పెగాసస్ మందులను లీటరు నీటికి 2ఎం.ఎల్ చొప్పున కలిపి చెట్లు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



నందికుంట సమీపంలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొత్తపల్లి/ఆత్మకూరు: పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులు చేపట్టడం ద్వారా పంట దిగుబడి, తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కె ప్రభాకర్, డాక్టర్ యం.శివరామకృష్ణ, డాక్టర్ ఆర్ నరసింహులు సూచించారు. గురువారం కొత్తపల్లి మండలంలోని నందికుంట గ్రామశివారు, ఆత్మకూరు మండలంలోని కరివేన, వడ్లరామాపురం గ్రామాల పరిధిలోని పత్తి, మొక్కజొన్న, మినుము, వరి పంటలను ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయతో కలసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్న ప్రస్తుతం గింజకట్టె దశ నుంచి కోత దశలో ఉందని, ఇవి బెట్ట పరిస్థితులను ఎదుర్కొంటుందన్నారు. వాటికి తెలిక పాటి తడులు ఇచ్చినట్లయితే గింజబరువు పెరిగి అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. పూత, కాయ దశలో ఉన్న పంటల్లో బెట్ట పరిస్థితుల నేపథ్యంలో పూత రాలకుండా నాఫ్తలిన్ ఎసిటిక్ యాసిడ్ (ఎన్ఏఏ) లీటర్ నీటిలో 3 గ్రా కలపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా మెగ్నీషియం, జింక్, బోరాన్, పోషక లోపాలను గమనించామన్నారు. వాటి నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10గ్రా, జింక్ సల్ఫేట్ 2గ్రా, బోరాన్ 1గ్రాను లీటర్ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ప్రత్తిపంటలో సమగ్ర సస్య రక్షణ కు లింగాకర్షక బుట్టలు ఎకరాకు 10 ఏర్పాటు చేసుకుంటే గులాబీరంగు, కాయతొలుచు పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.మహేష్, వ్యవసాయ సహాయకులు శివకృష్ణ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



తాటిపాడులో భుజాలపై మోస్తూ వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, మండ్లెం, తంగడంచ, తరిగోపుల, పారుమంచాల తదితర గ్రామాల్లో ఆనందోత్సవాల మధ్య గురువారం వినాయకుని నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా నాలుగు రోజులపాటు గణేషుని ప్రతిమలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కడసారిగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి జూపాడుబంగ్లా వద్ద కేసీ కాల్వలో నిమజ్జనం చేశారు.

తాటిపాడులో రూ.69వేలు పలికిన లడ్డూ

మండలంలోని తాటిపాడు గ్రామంలోని స్వామివారి వద్ద ఉంచిన లడ్డూను వేలం వేయగా గ్రామానికి చెందిన వంగల లక్ష్మీదేవి రూ.69వేలకు వేలం పాడి దక్కించుకొన్నారు. మరో విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను గ్రామానికి చెందిన పెద్దరాయుడు రూ.38వేలకు దక్కించుకున్నారు.

పంట నమోదు పకడ్బందీగా చేపట్టండి



పారుమంచాలలో ఈ- క్రాప్ నమోదు ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న ఏడీఏ విజయశేఖర్

జూపాడుబంగ్లా: పంట నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఏడీఏ విజయశేఖర్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని తంగడంచ, పారుమంచాల, గ్రామాల్లో పంటనమోదు ప్రక్రియను పరిశీలించారు. పారుమంచాల గ్రామంలో రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవడంతో పాటు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకొన్నప్పుడే ఈ క్రాప్ బుకింగ్ పూర్తవుతుందన్నారు. ఖరీఫ్‌లో పంట నష్టం వాటిల్లిన వారు, పంటలు సాగుచేయకుండా పొలం ఖాళీగా ఉంచుకొన్న రైతులకు 80శాతం రాయితీపై జొన్న, మొక్కజొన్న, కందులు, మినుము విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తాటిపాడు, మండ్లెం గ్రామాల్లో పంట నమోదును ర్యాండమ్‌గా చెక్‌చేశారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మత్స్యకారులకు రుణాలు అందజేస్తున్న ఏపీజీ రీజనల్ మేనేజర్ నవీన్ కుమార్

వెలుగోడు: బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ సూచించారు. గురువారం స్థానిక బ్యాంకులో 50 మంది మత్స్యకారులకు రూ.25 లక్షల రుణాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ..నంద్యాలలో మత్స్యకారులకు కోటి రూపాయల రుణాలు అందించామన్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే తిరిగి రెట్టింపు రుణాలు పొందవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒకే రంగంలో స్థిరపడకుండా పలు రంగాల్లో రాణించాలని సూచించారు. ఏపీజీబీలో అధిక వడ్డీలు అందజేస్తున్నామని, ఏపీజీ సురక్ష, పీఎంజేజేబీవై, రికవరింగ్ డిపాజిట్లు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో నంద్యాల రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్ కరీం, ఎస్ఆర్‌కే ఎస్ఎం రమేష్ పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: మండల పరిధిలోని అలగనూరు గ్రామానికి చెందిన తత్తూరు శ్రీనివాసులు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మృతుని కుటుంబానికి (నామిని భార్య)సుజాతకు రూ.10 వేలు తక్షణ సాయంగా గ్రామసర్పంచు కృష్ణవేణమ్మ గురువారం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, వెల్ఫేర్ అసిస్టెంట్ యాస్మీన్, గ్రామవలంటీర్లు ఉన్నారు.

డైమండ్ జూబ్లీ వేడుకలకు సహకరించండి



మాట్లాడుతున్న వీవీ లక్ష్మీనారాయణ, మగ్బుల్

శ్రీశైలం: శ్రీశైలం ప్రాజెక్ట్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (స్పోసా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశైలంప్రాజెక్ట్‌లో హైస్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలకు అందరూ సహకరించాలని సీబీఐ మాజీ జేడీ, స్పోసా వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ కోరారు. గురువారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్‌కు సంబంధించిన కోఆర్డినేటర్లు, పూర్వవిద్యార్థుల కోసం వసతి సౌకర్యం కల్పించాలని ఆయా సత్రాల యాజమాన్యం వారికి విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 28, 29 తేదీల్లో చరిత్రలో నిలిచిపోయే విధంగా వేడుకలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. సుమారు 60 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులు శ్రీశైలం ప్రాజెక్ట్ పాఠశాలలో విద్యను అభ్యసించి తదనంతరం పైచదువులకు తరలివెళ్లారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థులందరినీ వేడుకలకు ఆహ్వానించామన్నారు. వీరితో పాటు డ్యాం నిర్మాణంలో వివిధ స్థాయిలో పనిచేసిన కార్మికుల నుంచి ఈఈ, ఎస్ఈల వరకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మొదలైన వారందరినీ సన్మానించాలని నిర్ణయించామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పూర్వ విద్యార్థులకు శ్రీశైలంలోని సత్రాల వారు వీలైనంత ఉచితంగా సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఉత్సవాలకు హాజరయ్యే వారు ముందుగా స్పోసా గ్రూప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

సీఎంకు కృతజ్ఞతలు

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ బిల్లును ప్రవేశపెట్టడంతో ఒప్పంద అధ్యాపకుల సంఘం జేఏసీ ఫైనాన్స్ కార్యదర్శి అబ్దుల్ బజ్జాబ్ కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ప్రారంభమైన తొలిరోజే బిల్లు ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. సీఎం ప్రవేశ పెట్టిన ఈ బిల్లు ఆమోదం పొందాలని కోరారు.

ఈ-కేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలి

పాములపాడు: ప్రతి రైతు ఈ-కేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఏఓ ఫణీశ్వరరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని మిట్టకందాల, మద్దూరు గ్రామాల్లో ఆర్బీకేలను తనిఖీ చేశారు. అలాగే పొలాల ఈ క్రాప్ నమోదుపై సూపర్‌చెక్ చేశారు. రైతులతో పైర్ల గురించి చర్చించారు. సోయాబిన్, మొక్కజొన్న పైర్లలో ఉన్న పురుగులను గుర్తించి నివారణకు వాడాల్సిన రసాయన మందుల గురించి వివరించారు. వీహెచ్ఏ ప్రియాంక, ఎవపీఈఓ ముర్తుజావలి, రైతులు పాల్గొన్నారు.

బైర్లూటిలో ఎస్టీ హాస్టల్ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: బైర్లూటి చెంచుగూడెంలో ఎస్టీ బాలుర వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఆ సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బైర్లూటి గూడెంలో ఎస్టీ బాలుర వసతిగృహం ఉండేదని, దానిని తొలగించడం అన్యాయమన్నారు. ప్రస్తుతం గూడెంలో వసతిగృహాన్ని ఏర్పాటు చేస్తే వివిధ చెంచుగూడేల నుంచి 100 నుంచి 200 వరకు విద్యార్థులు వచ్చి చదువుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజు, రాజేష, సునీల్ తదితరులు పాల్గొన్నారు

హోటళ్ల తనిఖీ

ఆత్మకూరు: పట్టణంలోని మూన్‌స్టార్, సౌభాగ్య, అభివృద్ధి, విజయలక్ష్మి తదితర హోటళ్లను గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. హోటళ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

మహానంది: మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శివనాగజ్యోతి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ 22న సీతారామాపురం, బొల్లవరం గ్రామాల్లో, 23న మసీదుపురం, బుక్కాపురం సచివాలయాల పరిధిలో క్యాంపులు ఉంటాయన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్..దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటిన తెలుగు వైతాళికుడు గురజాడ అప్పారావు అని కొనియాడారు. బాల్య వివాహాలు, కన్యాశుల్కం లాంటి సాంఘిక దురాచారాలను ఎదురించిన గొప్ప సంఘ సంస్కర్తగా అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.రాజన్న, మహేశ్వరరెడ్డి, బాలు, శర్మ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

మహానంది: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలంలోని అయ్యవారికోడూరు సచివాలయంలో గురువారం తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ వాసుదేవగుప్త మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు ప్రతి రోజూ క్రమం తప్పకుండా స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం నియోజకవర్గ క్రీడాపోటీలు ప్రారంభం



గౌరవవందనం స్వీకరిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఆర్డీఓ దాసు, మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారూఫ్

ఆత్మకూరు: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, ఆర్డీఓ దాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజవర్గం స్థాయి క్రీడాపోటీలను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని చదువు పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, పీఈటీలు దేవానంద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు

నందికొట్కూరు: క్రీడల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి షేక్ ఉస్మాన్ బేగ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండో రోజు జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 సెలక్షన్ పోటీలు ముగిశాయి. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనాథ్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. క్రీడాకారులకు అని విధాలుగా సహకరించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాప్ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ జలీల్ అహ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు జస్వింతాదేవి, విజయకుమారి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాపోటీలకు ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపిక య్యారని హెచ్ఎం వీరన్న తెలిపారు. గురువారం ఎంపికై న విద్యార్థులను హెచ్ఎంతో పాటు వ్యాయమ ఉపాధ్యాయుడు సుంకన్న నాయక్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఆయన మాట్లాడుతూ అండర్ – 14 ఖోఖోలో శివపురం గూడెంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు కె.సరస్వతీబాయి, ఏ వైష్ణవి ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపియ్యారన్నారు.



జిల్లా పోటీలకు ఎంపికైన నందికొట్కూరు కబడ్డీ జట్టు

పగిడ్యాల: నందికొట్కూరు పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొని పగిడ్యాల జట్టు ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు హెచ్ఎం మధుసూదన్‌రావు గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో ఎంపికైన వివిధ పాఠశాలల క్రీడాకారులు పగిడ్యాల జట్టుగా ఏర్పడినట్లు వివరించారు. ఎంపికై న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తాచాటిన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీఈటీలు, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలో ముగిసిన స్కూల్‌స్థాయి క్రీడల్లో మండలంలోని ఏడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలురకాల క్రీడల్లో సత్తాచాటినట్లు క్రీడల కో ఆర్డినేటర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అండర్-17 ఖోఖో విభాగంలో బాలుర జట్టు, అండర్-17, అండర్-14 బాలికల విభాగంలో వాలీబాల్ జట్లు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికయ్యాయన్నారు. అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా క్రీడల్లో గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ, ఏపీ మోడల్‌స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ పారుమంచాల, తరిగోపుల, మండ్లెం తదితర పాఠశాలల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై హర్షం

మహానంది: నూతన పార్లమెంట్‌లో తొలిబిల్లుగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం హర్షించదగిన విషయమని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఎంతో మంది సామాన్య మహిళలు సైతం ఎంపీలుగా పోటీ చేసే అవకాశం వస్తుందన్నారు. మహిళలు రాజకీయంగా ఎదగడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. మహిళా బిల్లు ఆమోదం పొందక ముందే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50శాతం, నామినేటెడ్ పదవుల్లో సైతం 50శాతం పదవులు కల్పించారన్నారు.

కేసు నమోదు

పగిడ్యాల: యువకుడిపై దాడికి పాల్పడి గాయపరిచిన కేసులో ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు బుధవారం పగిడ్యాలలో నిర్వహించిన గణేష్ నిమజ్జన వేడుకల్లో డ్రమ్స్ కొట్టి సంబరాల్లో మునిగిన పృథ్వీ అనే యువకుడిపై ఇదే గ్రామానికి చెందిన మల్లికార్జున, శివలు కర్రతో కొట్టి గాయపరిచారు. ఈ దాడిలో అతని తలపై రక్తగాయం ఏర్పడింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

తప్పిన ప్రమాదం

శ్రీశైలం: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం కర్ణాటక నుంచి శ్రీశైలానికి వస్తున్న 13 మంది భక్తులు గురువారం ఉదయం సాక్షిగణపతి వద్ద రోడ్డు పక్కన తమ తుఫాను వాహనాన్ని పార్క్‌చేసి వెళ్లారు. హ్యాండ్‌బ్రేక్ వేయకపోవడంతో వాహనం చెట్లలోకి దూసుకువెళ్లింది. అయితే ఆ సమయంలో అందులో ప్రయాణిస్తున్న వారంత సాక్షిగణపతి దర్శనార్థం వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న దేవస్థానం అధికారులు, స్థానిక పోలీసులు క్రేన్‌తెప్పించి చెట్లలోకి వెళ్లిన వాహనాన్ని రోడ్డు మీదికి చేర్చారు.

సెల్‌టవర్ ఎక్కిన ఎంఎస్ఎఫ్ నేతలు

మహానంది: ఎస్సీల వర్గీకరణ కోసం ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి పూల విజయ్‌కుమార్, జిల్లా కో కన్వీనర్ పూల వెంకటసుబ్బన్న అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా గురువారం బండిఆత్మకూరు మండలం యర్రగుంట్లలో నాయకులు, యువకులు సెల్‌టవర్ ఎక్కి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు పూల వెంకటసుబ్బన్నను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఆందోళన తీవ్రతరం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, వెంకటరమణ, చిన్నస్వామి, చిన్నపెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నాయకుజవాదం నాగేషులు, ఆరోగ్యం, వెంకటేశ్వర్లు, పట్టణంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు.



టవర్ ఎక్కి పైన కూర్చున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

నందికొట్కూరు: ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రేమరాజు మాదిగ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు.